సాక్షి
బాపట్ల

ఆదివారం । 20 । ఆగస్టు । 2023




వైభవంగా లక్ష్మీ పూజలు

తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రిపై శనివారం శ్రీ లక్ష్మీపూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన్న జీయర్‌స్వామి అనుగ్రహ భాషణ చేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2, 200, గరిష్ట ధర రూ.4, 400, మోడల్ ధర రూ.3, 400 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 520.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 859.80 అడుగుల వద్ద ఉంది.

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో రాహుకేతు పూజలు



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వరాలయంలో శనివారం నుంచి రాహు కేతు గ్రహ పూజలు శనివారం ప్రారంభించారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ మాట్లాడుతూ ప్రతిరోజు రాహుకాలంలో అభిషేకం, పూజలు చేయటానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.

వెబ్‌సైట్‌లో బ్యాక్‌లాగ్ పోస్టుల ప్రొవిజనల్ లిస్ట్

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులకు సంబంధించి ప్రొవిజనల్ లిస్ట్‌ను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందని ఎస్సీ వెల్ఫేర్ డీడీ మధుసూదన్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 54 ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్‌పోస్టులకు సంబంధించి మార్చి 25న నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా స్క్రూటినీ ప్రక్రియ అనంతరం ప్రొవిజనల్ లిస్ట్‌ను 19న https://www.gunturap.in/2023 వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. స్వీపర్, పబ్లిక్ హెల్త్ వర్కర్, గ్యాంగ్ మజ్దూర్, హోల్ టైమ్ సర్వెంట్, కళాసీ, డ్రెయిన్ క్లీనర్ పోస్టులకు సంబంధించిన రిట్ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఆ పోస్టుల భర్తీ ప్రక్రియ హైకోర్టు ఉత్తర్వులకు లోబడి ఉంటుందన్నారు. మిగిలిన అన్ని పోస్టులకు సంబంధించిన వెబ్‌సైట్‌లో తెలిపిన షెడ్యూల్ ప్రకారం భర్తీ ప్రక్రియ ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక వారి విద్యార్హతలతో సాధించిన ప్రతిభ ఆధారంగా జరుగుతుందని ఎవరూ దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలియజేశారు.

ఇరువురు ఎంఈఓలకు అదనపు బాధ్యతలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు పశ్చిమ, పెదకాకాని మండల విద్యాశాఖాధికారులు (ఎంఈఓ-1) పోస్టుల్లో ఇరువురు ఎంఈఓలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. గుంటూరు తూర్పు ఎంఈఓ-1గా ఉన్న వి.వెంకటేశ్వరరావును గుంటూరు పశ్చిమ-1, తాడికొండ ఎంఈఓ-1 టి.ఇందిరను పెదకాకాని ఎంఈఓ-1గా ఎఫ్ఏసీలుగా నియమించారు. సంబంధిత ఎంఈఓలు సెలవులో ఉన్న కారణంగా తాత్కాలిక ప్రాతిపదికన ఆయా పోస్టులను భర్తీ చేశారు.

మహా జాబ్‌మేళాకు పోటెత్తిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన మహా జాబ్‌మేళాకు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జిల్లాల వారీగా హాజరైన విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలో రిజిస్ట్రేషన్ చేశారు. కళాశాల మెయిన్ బ్లాక్‌తో పాటు జేకేసీ, కెమిస్ట్రీ, హోం సైన్స్ బ్లాక్‌లలో కంపెనీల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, కళాశాల విద్య ఏజీఓ డాక్టర్ తులసి మస్తానమ్మ, ఉన్నారు. 225 మంది విద్యార్థులు ఉద్యోగాలను సాధించారు.

'స్థానిక' ఉప ఎన్నికల్లో విజయకేతనం

- పావులూరు సర్పంచిగా వైఎస్సార్ సీపీ మద్దతుదారు లుథియమ్మ ఘన విజయం
- మున్నంగివారిపాలెంలో అమ్మిశెట్టి గెలుపు
- వార్డుల్లో అధికారపార్టీ మద్దతుదారుల ఘనవిజయం
- ఏకగ్రీవాల్లో అధికార పార్టీ మద్దతుదారుల హవా

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పంచాయతీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుదారులు జయకేతనం ఎగురవేశారు. జిల్లాలోని రెండు పంచాయతీలు, 11 వార్డులకు శనివారం పోలింగ్ నిర్వహించారు. ఇంకొల్లు మండలం పావులూరులో వైఎస్సార్ సీపీ మద్దతుదారు లుథియమ్మ విజయం సాధించారు. చుండూరు మండలం మున్నంగివారిపాలెం సర్పంచిగా జనసేన మద్దతుదారు అమ్మిశెట్టి శ్రీరాములు గెలుపొందారు. 11 వార్డులో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు 6 చోట్ల, టీడీపీ మద్దతుదారులు ఐదు స్థానాలు దక్కించుకుంది.

పావులూరులో భారీ ఆధిక్యం

ఇంకొల్లు మండలం పావులూరు పంచాయతీకి నిర్వహించిన ఉప ఎన్నిక పోలింగ్‌లో 62.22 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పంచాయతీలో మొత్తం 3,677 ఓట్లు ఉండగా 2,282 మంది ఓటు హక్కు వేశారు. మధ్యాహ్నం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో అధికారపార్టీ మద్దతుదారు లుథియమ్మ ఘన విజయం సాధించారు. ఆమెకు 1,285 ఓట్లు రాగా టీడీపీ మద్దతుదారుడిగా పోటీ చేసిన కొత్తపల్లి మహేష్‌కు 789 ఓట్లు, జనసేన మద్దతు పలికిన ఎలీషాకు 111 ఓట్లు మాత్రమే వచ్చాయి. 499 ఓట్లు ఆధిక్యంతో లుథియమ్మ గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు.

చుండూరు మండలం మున్నంగివారిపాలెం గ్రామపంచాయతీ ఎన్నికల్లో జనసేన బలపరిచిన అమ్మిశెట్టి శ్రీరాములు గెలుపొందారు. మొత్తం 1584 ఓట్లకుగాను 1321 మంది ఓటుహక్కును వినియోగించుకోగా జనసేన మద్దతుదారుడికి 679 ఓట్లు, అధికారపార్టీ మద్దతు దారునికి 616 ఓట్లు వచ్చాయి. దీంతో 63 ఓట్ల మెజారిటీతో జనసేన మద్దతుదారుడు విజయం సాధించారు.

వార్డు స్థానాల్లోనూ..

పంచాయతీలతో పాటు జిల్లా వ్యాప్తంగా 11వార్డు స్థానాలకు శనివారం ఎన్నికలు జరగ్గా వేమూరు మండలం వరహాపురం 10వ వార్డు, అమృతలూరు మండలం మూల్పూరు 5వ వార్డు, నగరం మండలం చినమట్లపూడి 3వ వార్డు, కారంచేడు మండలం స్వర్ణ 13వ వార్డు, జిల్లెళ్లమూడి ఆరో వార్డు, అద్దంకి ఎనిమిదో వార్డులో అధికారపార్టీ మద్దతుదారులు విజయం సాధించారు. మిగిలిన 5 వార్డుల్లో టీడీపీ మద్దతుదారులు గెలుపొందారు.

వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఏకగ్రీవాలు..

రెండు గ్రామ పంచాయతీలతో పాటు 35 వార్డు స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇవ్వగా 24 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో 23 స్థానాల్లో అధికార పార్టీ మద్దతుదారులు ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే.



ఇంకొల్లు మండలం పావులూరు సర్పంచిగా గెలుపొందిన లుథియమ్మకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎంపీడీఓ రాజ్యలక్ష్మి



జిల్లెళ్లమూడి ఆరోవార్డులో సుబ్బులుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఆర్ఓ ప్రసాదరావు



దోనేపూడిలో ఓట్ల లెక్కింపు దృశ్యం



వరహాపురం 10వార్డుకు ఎన్నికైన వైఎస్సార్ సీపీ మద్దతుదారు సుభాషిణి



స్వర్ణ పంచాయతీ వార్డు విజేత యోహానుకు సర్టిఫికెట్ అందిస్తున్న ఆర్ఓ రమేష్‌బాబు

వార్డు పేరు	గెలుపొందిన అభ్యర్థి	మెజార్టీ
జిల్లెళ్లమూడి 6వ వార్డు	ఎం.సుబ్బులు	10 ఓట్లు
బుద్దాం 6వ వార్డు	నర్రా వెంకటేశ్వర్లు	28
మూల్పూరు 2వ వార్డు	ఎం.పద్మ	07
మూల్పూరు 4వ వార్డు	ఎం.శాంతకుమారి	21
చిలుమూరు 4వ వార్డు	ఎన్.శివయ్య	33
దోనేపూడి 5వ వార్డు	కె.శ్రీనివాసరావు	64
చినమట్లపూడి 3వ వార్డు	షేక్ నూరుద్దీన్	62
బేతపూడి 7వ వార్డు	ఎ.సుగుణమ్మ	35
వరహాపురం 10వ వార్డు	పి.సుభాషిణి	25
శంకవరప్పాడు 8వ వార్డు	బి.రాఘవరెడ్డి	60
స్వర్ణ 13వ వార్డు	మద్దె యోహాను	179

పంచాయతీ ఉప ఎన్నికలు ప్రశాంతం

బాపట్లటౌన్: పంచాయతీ, వార్డు మెంబర్ల ఉప ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్‌కు బందోబస్తు మధ్య నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలో 2 గ్రామ సర్పంచి, 11 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ నిర్వహించగా మొత్తం 334 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.



పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించిన పోలీసులు

ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న జడ్జి వాణి

బాపట్ల: ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి పేర్కొన్నారు. బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాల్లో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ర్యాగింగ్‌పై జడ్జి జి.వాణి మాట్లాడుతూ నేరానికి పాల్పడే వారిపై తగిన చర్యలు ఉంటాయని చెప్పారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లీలా కృష్ణ, డాక్టరు సందీప్, రామారావు, అసోసియేషన్ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్స్‌ను బడిబాట పట్టించాలి

బాపట్ల: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో డ్రాప్ అవుట్స్ గుర్తించి పాఠశాల, కళాశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా ఆదేశించారు. డ్రాప్ అవుట్స్ విద్యార్థుల వివరాలపై అనుబంధశాఖల అధికారులతో శనివారం తన చాంబర్లో సమావేశం నిర్వహించారు. 47 వేల మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరాల్సి ఉండగా, 50శాతం పైగా విద్యార్థులు కళాశాలలో చేరినట్లు నివేదికలు ఉన్నాయని చెప్పారు. మిగిలిన 23,248 మంది విద్యార్థుల వివరాలలో స్పష్టత లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థుల వివరాలు నమోదు చేయకుండా ఏం చేస్తున్నారని విద్యాశాఖ అధికారులపై మండిపడ్డారు. 9,485 మంది విద్యార్థులు బాపట్ల జిల్లాలోనే ఆయా కళాశాలల్లో ఇంటర్మీడియెట్ చేరారని తెలిపారు. మిగిలిన 700 మంది విద్యార్థుల వివరాలు సేకరించకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. పాఠశాలల్లో 5,121 మంది డ్రాప్ అవుట్స్ జాబితాలోనే ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఇంటర్మీడియెట్ బోర్డ్ డివిజనల్ ఆర్‌ఐ ఓ ఆంజనేయులు, ఏఎస్ఓ సంజీవరావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు మంచి రోజులు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బోధన చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకురాలు

క్రమబద్ధీకరణ జీవితం

- ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించింది
- జిల్లాలో 62 మందికి లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

బాపట్ల అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు మంచి రోజులు వచ్చాయి. చిరకాల స్వప్నం ఫలించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెగ్యులరైజ్ చేస్తూ జీఓ జారీ చేశారు. దీంతో ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న అధ్యాపకుల నిరీక్షణ ఫలించింది. జిల్లాలో 62 మందికి లబ్ధి చేకూరనుంది.

క్రమబద్ధీకరణతో..

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కేవలం నెలకు రూ. 18వేలు జీతం ఏడాదిలో పది నెలలు అందేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి వేతనం నెలకు రూ.57,100 పెంచింది. అది కూడా 12 నెలలు కాలానికి అందజేస్తోంది. తాజాగా 2014 జూన్ 2కు ముందు ఉద్యోగంలో చేరి ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేస్తూ సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వీరికి ప్రభుత్వం ఉద్యోగులుగా వర్తింపజేసి, సదుపాయాలు వర్తించటంతో జిల్లాలోని సుమారు 62 మంది అధ్యాపకుల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డిగ్రీ కళాశాలలో 4,100 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేస్తుండగా బాపట్ల జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాదాపు 62 మంది విధులు నిర్వహిస్తున్నారు.

ఆశలు ఫలించాయి



ఏళ్ల తరబడి ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాం. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మా ఆశలు సీఎం వై.ఎస్.జగన్ రూపంలో ఫలించాయి. ఆయన మేలు మరువలేనిది.

– కె.కిషోర్ బాబు, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, బాపట్ల

జగనన్నకు కృతజ్ఞతలు



జూనియర్ లెక్చరర్లకు ముఖ్యమంత్రి తీపి కబురు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 3,626 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరలను క్రమబద్ధీకరించారు. ఇది మా కుటుంబాల్లో ఆర్థిక వెలుగు నింపుతోంది. మాలాంటి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగనన్న మేలు మరువలేం. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–ఎస్‌కే బాజీ, జూనియర్ లెక్చరర్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, చీరాల

ఎన్నడూ లేని విధంగా



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాయి. గతంలో ఏ ప్రభుత్వం చేయనిది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసి చూపింది. మా ఉద్యోగుల తరపున సీఎం వై.ఎస్.జగన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు.

– ధనలక్ష్మి, కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్, చందోలు

జీవితానికి భరోసా



గతంలో మా సమస్యను ప్రజాసంకల్ప యాత్రలో జగనన్నకు వివరించాం. అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పకుండా క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మా జీవితానికి భరోసా కల్పించారు.

– నీరజ , కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్, అద్దంకి

సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా
- 30న వేటపాలెంలో జగనన్న కాలనీ ప్రారంభం

వేటపాలెం: పేదల సొంతింటి కల నెరవేరుస్తూ వారికి శాశ్వత గూడు కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. వేటపాలెం మండలం బచ్చులవారిపాలెం వెళ్లే రోడ్డులో నూతనంగా నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ కొణిజేటినగర్-2ను కలెక్టర్, ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి శనివారం పరిశీలించారు. కాలనీలో ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలు, లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పక్కా గృహాలను సందర్శించారు. లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, రుణాల పంపిణీ, కాలనీలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 30వ తేదీన జగనన్న కాలనీని ప్రారంభిస్తున్నారని చెప్పారు. అదే రోజున మండల పరిధిలోని నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాలనీలో 303 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు పంపిణీ చేశామని చెప్పారు. 283 మంది లబ్ధిదారులకు పక్కాగృహాలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం 270 గృహాలు నిర్మాణాలు ప్రారంభించగా 203 గృహాలు తుది దశకు చేరుకుని మరో పది రోజుల్లో పూర్తికానున్నాయని వివరించారు. అన్ని గృహాలు ప్రారంభించడానికి లబ్ధిదారులు సిద్ధంగా ఉండాలని కోరారు. కాలనీలో మురుగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు రూ.1.20 కోట్ల రుణాలు లబ్ధిదారులకు అందజేశామన్నారు. కాలనీలో రూ.5 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కొళాయి కనెక్షన్ అందజేస్తున్నట్లు చెప్పారు. కాలనీలో రూ.38.25 లక్షలతో అంతర్గత రహదారులు మంజూరయ్యాయని, వారంలో పనులు మొదలవుతాయని వెల్లడించారు.




లబ్ధిదారులకు రుణాల చెక్కులు అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కరణం

సుందరంగా ఇళ్ల నిర్మాణం

పేదల సంక్షేమం కోసమే ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. జగనన్న కాలనీలలో ఇళ్లు సుందరంగా నిర్మించుకోవడానికి అవసరమైన నగదు, నిర్మాణ సామగ్రిని ప్రభుత్వం అందజేసిందన్నారు. అనంతరం రూ.13 లక్షల రుణాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ పి.సరోజిని, గృహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ బి.అర్జునరావు, డ్వామా పీడీ వై.శంకర్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బెనహర్, పీఆర్ ఎస్ఈ హరేరామకృష్ణ పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 4513 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 120, బ్యాంక్ కెనాల్‌కు 1408, తూర్పు కెనాల్‌కు 468, పశ్చిమ కెనాల్‌కు 107, నిజాంపట్నం కాలువకు 260, కొమ్మమూరు కాల్వకు 1983 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

చీరాల: ఎస్సీ నిరుద్యోగ యువతను బ్యాక్‌లాగ్ పోస్టులు ఇప్పిస్తామని నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేసిన వ్యక్తిని శనివారం చీరాల రూరల్ ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. చీరాల రూరల్ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఆనందపేటకు చెందిన యాతం క్రాంతి, ఎస్సీ నిరుద్యోగ యువతకు బ్యాక్‌లాగ్ పోస్టులు ఇప్పిస్తామని చెప్పి మోసం చేశాడన్నారు.

ఉద్యోగాల పేరిట మరికొందరి వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేయగా చీరాల రూరల్ మండలం వాడరేవుకు చెందిన రూబెన్ కుమారుడికి బ్యాక్‌లాగ్ పోస్టు ఇప్పిస్తానని చెప్పడంతో అతడు రూ.4.50 లక్షలు విడతల వారీగా ఇచ్చినట్లు చెప్పారు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం రాకపోయేసరికి మోసపోయామని గ్రహించి ఒత్తిడి చేయడంతో ఫోర్జరీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి మోసం చేశాడన్నారు. దీంతో తనను ఉద్యోగాల పేరిట మోసం చేశాడంటూ ఈపూరుపాలెం రూరల్ పోలీసులకు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు అనంతరం యాతం క్రాంతిని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లాడు.. శవమై వచ్చాడు

కొమ్మమూరు కాలువలో గల్లంతైన యువకుడు



మృతి చెందిన బాలసుబ్రహ్మణ్యం

కారంచేడు: చేపలు పట్టుకోవడం కోసం కొమ్మమూరు కాలువ వద్దకు వెళ్లిన యువకుడు శవమై తేలిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. చీరాల కొత్తపాలెం యానాది కాలనీకి చెందిన బాలసుబ్రహ్మణ్యం(19) స్నేహితులతో కలసి మండలంలోని స్వర్ణ గ్రామ సమీపంలోని కొమ్మమూరు కాలువ వద్దకు వెళ్లాడు. కొద్దిసేపు చేపలు పట్టిన తరువాత కాలువలో ఈత కొట్టేందుకు దిగాడు. ఈత కొడుతుండగా కొన్ని పశువులు కాలువలోకి రావడాన్ని గమనించాడు. బాలసుబ్రహ్మణ్యం అటు వైపు కట్ట మీదకు వెళ్లేందుకు అటువైపు వెళ్తుండగా ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి వేగానికి ముందుకు కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న తన స్నేహితులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు. కొద్ది సేపటికే శవంగా మారాడు. స్నేహితుడి మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలిసిన కారంచేడు ఎస్‌ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు అవివాహితుడు.

ఫొటో మెరికలు



ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఒంగోలు కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ కాంపిటీషన్- 2023లో చినగంజాంకు చెందిన ఫొటో గ్రాఫర్ రావి సీతారామయ్య ప్రథమ స్థానం సాధించాడు. శనివారం ఒంగోలు అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రకాశం కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్పీ మల్లికా గార్గ్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. కలెక్టర్, సీతారామయ్యకు శాలువా కప్పి, మెమొంటోతో సత్కరించగా ప్రథమ బహుమతి కింద రూ.20 వేలు నగదును ఎస్పీ మల్లికా గార్గ్ అందజేశారు. - చినగంజాం



రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో వేటపాలేనికి చెందిన గాత్రం బాలాజీ మోహన్ కృష్ణ తీసిన ఫొటో తృతీయ స్థానంలో నిలిచింది. ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా ఒంగోలు కళానిలయంలో బీఎంఆర్ గోల్డెన్ డైమండ్ సంస్థ రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ పోటీలు శనివారం నిర్వహించింది. బాలాజీకి ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికా గార్గ్ చేతుల మీదుగా బహుమతి అందజేశారు. బాలాజీని పలువురు మిత్రులు, బంధువులు అభినందించారు. - వేటపాలెం

మతిస్థిమితం లేని వ్యక్తిని తల్లిదండ్రులకు అప్పగింత

కారంచేడు: మతిస్థిమితం లేని కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆచుకీ తెలుసుకుని కొడుకును అప్పగించారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు అందించిన వివరాలు.. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపల్లి గ్రామానికి చెందిన సుమారు 34 ఏళ్ల ఉండవల్లి వీరవెంకట సత్యనారాయణ పొక్లెయిన్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. తను కష్టపడి సంపాదించుకుంటూ తల్లిదండ్రులను పోషించుకుంటూ ఉండేవాడు. మూడు నెలల క్రితం ఉన్నట్టుండి ఇంటి నుంచి బయటికి వచ్చాడు. శుక్రవారం కారంచేడు మండలం కుంకలమర్రులో తిరుగుతుండగా గ్రామస్తులు గమనించి దొంగగా భావించి పోలీసులకు సమాచారం అందించారు. స్టేషన్ నుంచి ఎస్‌ఐ ఆదేశాలతో కానిస్టేబుల్ శ్రీహరి వెళ్లి స్టేషన్‌కు తీసుకొచ్చి వివరాలు సేకరించాడు. వివరాలు తెలుసుకుని తాళ్లపూడి పోలీస్‌స్టేషన్‌ను సమాచారం అందించారు. తండ్రి బుల్లివీరరాజు కారంచేడు వచ్చాడు. బిడ్డను పోలీసులు అప్పగించారు.

సంజీవదేవ్ భావజాలం విభిన్నం

- ఎప్పటికీ గుర్తుండిపోతారు
- సుప్రసిద్ధ ఆర్థికవేత్త, ఎకనామిక్ అండ్ పొలిటికల్ జర్నల్ సంపాదకుడు ప్రొఫెసర్ ఎస్.మహేంద్రదేవ్



పుస్తకాన్ని ఆవిష్కరించిన మహేంద్రదేవ్, పక్కన లలితానందప్రసాద్, దక్షిణామూర్తి, రాజగోపాల్

తుమ్మపూడి(తెనాలి): విభిన్న భావజాలంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కవి, రచయిత, చిత్రకారుడు, విమర్శకుడిగా గుర్తింపును పొందిన సంజీవదేవ్ తనను తెలిసిన, చదివిన అందరికీ ఎప్పటికీ గుర్తుండిపోతారని సుప్రసిద్ధ ఆర్థికవేత్త, ఎకనామిక్ అండ్ పొలిటికల్ జర్నల్ సంపాదకుడు ప్రొఫెసర్ ఎస్.మహేంద్రదేవ్ అన్నారు. సంజీవదేవ్ స్వస్థలమైన దుగ్గిరాల మండల గ్రామం తుమ్మపూడిలోని ఆయన నివాసం 'రసరేఖ' ప్రాంగణంలో శనివారం సాయంత్రం సభకు ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ బి.లలితానంద ప్రసాద్ రచించిన 'ఎప్పటికీ అందరికీ సంజీవదేవ్' పుస్తకాన్ని మహేంద్రదేవ్ ఆవిష్కరించారు. పాఠశాల విద్య కూడా లేని సంజీవదేవ్ స్వయంకృషితో సాహితీవేత్తగా, చిత్రకారుడిగా, తత్వవేత్తగా ఎదిగారని గుర్తు చేసుకున్నారు. తాను నిత్యం ఆస్వాదించే ప్రకృతినీ, ప్రసిద్ధులైన వ్యక్తులను అక్షరబద్ధం చేశారని చెప్పారు. ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ మాట్లాడుతూ, ఐహికం, పారమార్థానికి రెండింటికీ భిన్నంగా తనదైన వింతైన లోకంలో సంజీవదేవ్ చివరి వరకు విహరించారని చెప్పారు. 'చినుకు' పత్రిక సంపాదకుడు నండూరి రాజగోపాల్ పుస్తక సమీక్ష చేస్తూ సంజీవదేవ్ ఏదైతే చెప్పారో దానిని చివరి వరకు ఆచరించారని చెప్పారు. చైతన్యవేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, తెలంగాణకు చెందిన జితేంద్రబాబు, సంజీవదేవ్ ఫౌండేషన్ వైవీ రావ్ , రచయితలు డాక్టర్ సామల రమేష్‌బాబు, అనిల్‌డ్యానీ, రజాహుస్సేన్, జుగాష్‌విలి, మందరపు హైమావతి, డాక్టర్ రావెల సాంబశివరావు పాల్గొన్నారు.

ఆరేళ్ల బాలికపై యువకుడి లైంగిక దాడికి యత్నం

భట్టిప్రోలు: ఆరేళ్ల బాలికపై 20 ఏళ్ల యువకుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. భట్టిప్రోలు మండలం వెల్లటూరు స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు ఇంటి వద్ద ఉన్న పశువుల చావిడి వద్దకు తీసుకువెళ్లాడు. పాఠశాల హెచ్‌ఎం హాజరైన 39 మందిలో బాలిక కనిపించకపోవడంతో విద్యార్థులను ఆరా తీశారు. ఓ యువకుడు వచ్చి ఆ బాలికను తీసుకెళ్లినట్లు చెప్పడంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఆయా కలసి ఆ యువకుడి ఇంటి వద్దకు వెళ్లారు. వారు రావడం చూసి ఆ యువకుడు పారిపోతుంటే అతడిని పట్టుకుని గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారీ సంఖ్యలో బాలిక తరఫున బంధువులు రావడంతో అక్కడికి వేమూరు సీఐ వెంకటేశ్వరరావు, కొల్లూరు ఎస్‌ఐ జి.రాజ్యలక్ష్మి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. యువకుడిపై ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమల శిక్షణతో మేలు

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాసరావు



శిక్షణకు ఎంపికైన విద్యార్థులతో డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు

బాపట్ల: విద్యార్థులను ఉత్తమ వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే అవకాశాన్ని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కల్పిస్తోందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. తమ కళాశాలకు చెందిన పది మంది బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు హైదరాబాద్‌లోని సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల జాతీయ సంస్థ(ఎన్.ఐ.ఎం.ఎస్.ఎం.ఈ)లో శిక్షణకు ఎంపికయ్యారని తెలిపారు. విద్య, విస్తరణ, పరిశోధన, కన్సల్టెన్సీ తదితర అంశాలలో వారికి శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. నైపుణ్యాలు, మార్కెటింగ్‌పై వారికి అవగాహన కల్పించడమే కాక వ్యవసాయ రంగంలో వారిని ఉత్తమ పారిశ్రామిక వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని వివరించారు. ఈ శిక్షణ ఈ నెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు ఉంటుందని చెప్పారు. 13 మంది విద్యార్థినులు హైదరాబాద్‌లోని నీరు, భూమి నిర్వహణ శిక్షణ మరియు పరిశోధన సంస్థ (వలంటరీ)లో 21 రోజులపాటు శిక్షణకు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి శిక్షణ ఈ నెల 22వ తేదీ నుంచి సెప్టెంబర్ 11వ తేదీ వరకు ఉంటుందన్నారు. కచ్చితమైన వ్యవసాయం, నీటి నిర్వహణలో వారికి శిక్షణ ఉంటుందని చెప్పారు. పూర్తి మెరిట్ ఆధారంగా విద్యార్థినులను ఈ శిక్షణకు ఎంపికజేయడం జరిగిందన్నారు. సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక(ఎన్‌ఏహెచ్‌ఈపీ) లో భాగంగా శిక్షణ ఇవ్వబడుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఐడీపీ., ఎన్‌ఏహెచ్‌ఈపీ కో ఆర్డినేటర్లు డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ వి.సీతారాం బాబు, డాక్టర్ బి.రత్నకుమారి పాల్గొన్నారు.